ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి చెన్నై కార్యాలయం
చిరునామా మార్పు..
"జి.4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెంబరు:40, న్యూనెంబర్: 35, విజయరాఘవరోడ్డు, టి.నగర్, చెన్నై-600 017"
చిరునామాలో మంగళవారం నుంచి చెన్నై కార్యాలయం పని చేయనుంది. పాఠకులు గమనించగలరు.



ఢిల్లీలో దేశ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయిన గవర్నర్ ఆర్ఎన్ రవి



టార్పాలిన్ గుడిసె ముందు ఒంటరిగా కూర్చున్న కుట్టియమ్మాళ్

ఘీంకరిస్తున్నా.... ఇక్కడే నివసిస్తున్నా

ఏనుగుల సంచారం మధ్య పొదిగైమలైలో టార్పాలిన్ పాక

శతాధిక వృద్ధురాలి ఒంటరి జీవనం

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా పడమటి కనుమల్లోని పొదిగైమలై శిఖరాగ్రాన ఇంజికుళి అనే కుగ్రామంలో శతాధిక వృద్ధురాలు ఒంటరిగా జీవితం గడుపుతోంది. అది కూడా ఏనుగుల ఘీంకారాలు, క్రూర జంతువుల మధ్యలో టార్పాలిన్ కింద శేషజీవితాన్ని నెట్టుకొస్తోంది. ప్రస్తుతం ఆ కుగ్రామంలో వృద్ధురాలి కుటుంబంతో పాటు మరో రెండు కుటుంబాలు అక్కడ జీవిస్తున్నాయి. దట్టమైన అరణ్యానికి చేరువగా చుట్టూ ప్రవహించే వాగులు, తరుచూ వినిపించే ఏనుగుల ఘీంకారాలు ఇవేవీ ఆ మూడు కుటుంబాలను అక్కడి నుండి కదిలించలేకపోయాయి. ప్రభుత్వ రికార్డుల్లో ఆ వృద్ధురాలి పేరు కుట్టియమ్మాళ్. వయస్సు 110 యేళ్లుగా పేర్కొన్నప్పటికీ ఆమె వయస్సు అంతకుపైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇంజికుళి గ్రామంలో గతంలో 40 కుటుంబాలు నివసించేవి. ప్రస్తుతం మూడు కుటుంబాలే అక్కడ నివసిస్తున్నాయి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో పర్యాటకుల సంచారంపై అధికారులు నిషేధం విధించారు. ఆ గ్రామానికి సరైన రహదారి గానీ, విద్యుత్ సదుపాయం గానీ లేవు. ఓ టార్పాలిన్‌తో నిర్మించిన ఇంటిలో కుట్టియమ్మాళ్ నివసిస్తోంది. నాలుగేళ్ల క్రితం అప్పటి తిరునల్వేలి జిల్లా కలెక్టర్ విష్ణు ఆ వృద్ధురాలికి వృద్ధాప్య పింఛన్ ప్రకటించారు. ఆమె ఇంటికి సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు. ప్రతినెలా కారైయార్ తపాలాఫీసు నుండి పోస్ట్‌మెన్ క్రీస్తురాజా ఆ కొండపైకి నడిచి వెళ్ళి ఆమెకు ప్రభుత్వ పింఛన్‌ను అందజేస్తున్నారు. వృద్ధాప్యం కారణంగా కుట్టియమ్మాళ్ ఎక్కడికీ వెళ్ళలేకున్నారు. ఈ విషయమై కుట్టియమ్మాళ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఒకప్పుడు 40 కుటుంబాలుండేవని, తగిన సదుపాయాలు లేకపోవడంతో అందరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిపోయారని తెలిపింది. ఏ ఆదరణా లేని తాను మాత్రమే ఒంటరిగా ఈ టార్పాలిన్ ఇంటి పూటకింత వండుకుని తింటున్నానని వాపోయింది. తనతో పాటు రెండు కుటుంబాలవారు వున్నా, వారు కూలి పనుల కోసం వేరే ప్రాంతాలకు వలస వెళ్తారని, వారు ఎప్పుడు తిరిగి వస్తారో చెప్పలేనని పేర్కొంది. తాను ఈ ప్రాంతాన్ని విడిచివెళ్ళలేకపోతున్నానని, అడవిలో లభించే చిలగడదుంపలు, పండ్లు తిని బ్రతుకుతున్నానని వివరించింది. తన ఇంటి వద్దకే అధికారులు రేషన్ సరకులు, పింఛను అందిస్తుండడంతో పూటకింత తినగలుగుతున్నానని కుట్టియమ్మాళ్ బోసినవ్వులు కురిపించింది.

డీఎంకేని ఇరుకున పెట్టిన మిత్రపక్షం

- అన్నాడీఎంకే కూటమిలో విజయ్ చేరితే గట్టి పోటీ ఖాయం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే మిత్రపక్షంగా వున్న సీపీఎం.. కూటమిని ఇరుకునపెట్టేలా వ్యాఖ్యలు చేసింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ డీఎంకేను ఇబ్బంది పెట్టేలా ఉంది. ఆ కూటమిలో లుకలుకలకు కారణమవుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ అన్నాడీఎంకేతో చేతులు కలిపితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు గట్టి పోటీ తప్పదని షణ్ముగం అంగీకరించారు. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికల్లో ప్రత్యర్థి కూటమిలో పరిస్థితుల ఆధారంగా తమ (డీఎంకే కూటమి) విజయం ఆధారపడి ఉంటుందన్నారు. నటుడు విజయ్ ఎన్నికల ప్రణాళిక కూడా ఆ విజయంలో పాత్ర పోషిస్తుందన్నారు. నటుడు విజయ్ కార్యక్రమాలకు వచ్చే వారు ఆ పార్టీకే ఓట్లు వేస్తారా లేదా అన్నది స్పష్టత లేదన్నారు. అన్నాడీఎంకే-బీజేపీ కూటమిలో పీఎంకే చేరినా డీఎంకే కూటమికి సవాలు తప్పదన్నారు. అదే సమయంలో, అన్నాడీఎంకే కూటమిలో నటుడు విజయ్ చేరితే ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటుందన్నారు. ఆ ఎన్నికల్లో తమ కూటమి ఎన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందో చర్చించాల్సి ఉందన్నారు. గత ఎన్నికల కన్నా అధిక స్థానాల్లో పోటీచేయాలన్నదే తమ ఉద్దేశమని, గత ఎన్నికల్లో ఆరు స్థానాల్లో చేసిన తాము.. ఈ సారి మరిన్ని స్థానాలు కోరుకుంటున్నట్లు తెలిపారు.



దివగంత ముఖ్యమంత్రి అన్నాదురై కాలం నుంచి పెట్టుబడిదారులకు అండగా డీఎంకే ఉందని, ఇప్పుడు కూడా ఆ పార్టీ ప్రాథమిక లక్షణంలో ఎలాంటి మార్పు లేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ చెబుతున్న ద్రావిడ మోడల్ పాలన ఎన్ని సందర్భాల్లో అమలుచేయబడిందని ప్రశ్నించారు. అయితే నేటి సమకాలిన రాజకీయాల్లో తమిళనాట బీజేపీ కాలుపెట్టకుండా అడ్డుకోడానికి డీఎంకే లాంటి బలమైన, లౌకిక పార్టీ అవసరం ఎంతైనా ఉందన్నారు. లౌకిక పార్టీలను ఏకం చేయడంలో డీఎంకే ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్ర హక్కుల కోసం తీసుకున్న అన్ని చర్యలకు తమ పార్టీ స్టాలిన్‌కు మద్దతుగా ఉంటుందని తెలిపారు. కరుణానిధి, స్టాలిన్ ప్రభుత్వాలను పోల్చలేమని, ఇంకా చేయగల సత్తా స్టాలిన్‌కు ఉందన్నారు. అదే సమయంలో ఎన్నికల సమయంలో డీఎంకే ఇచ్చిన హామీలు నెరవేర్చారా అనే విషయాన్ని గమనించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో డీఎంకే పాలనలో 24 ఎన్‌కౌంటర్లు జరిగాయని, పోలీసు శాఖలో సంస్కరణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా అవసరమన్నారు. పోలీసు కస్టడీలో మృతి చెందిన ఆలయ గార్డు అజిత్ కుమార్ ఘటనకు ఎన్నికల సమయంలో డీఎంకే తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనను తమ పార్టీ సమర్థించబోదని షణ్ముగం స్పష్టం చేశారు.

పార్టీల జెండాల తొలగింపు 31 శాతమేనా?

- విఫలమైతే విచారణకు రావాల్సిందే
- కలెక్టర్లకు హైకోర్టు మదురై బెంచ్ హెచ్చరిక



పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తమ ఆదేశాల తరువాత కూడా చెన్నైలో కేవలం 31 శాతం మాత్రమే రాజకీయ పార్టీల జెండాలను తొలగించడంపై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రద్దీ ప్రాంతాలు, రాష్ట్ర, జాతీయ రహదారులు, స్థానిక సంస్థలకు సొంతమైన ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన జెండా స్తంభాలు, కుల, మత సంస్థలు, సంఘాలు ఏర్పాటుచేసిన జెండా స్తంభాలను ఏప్రిల్ 28వ తేదిలోగా తొలగించాలని హైకోర్టు మదురై ధర్మాసనం జనవరిలో ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ కేసుపై మళ్లీ గురువారం న్యాయమూర్తి జీకే ఇళందిరైయన్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన నివేదికను న్యాయమూర్తి పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాల్లో 100 శాతం, 10 జిల్లాల్లో 90 శాతం పార్టీ జెండా స్తంభాలు తొలగించినట్లు నివేదికలో పేర్కొంది. చెన్నైలో 31 శాతం జెండా స్తంభాలు తొలగించినట్లు తెలియజేసింది. అదే సమయంలో, బహిరంగ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు నిర్వహించే సభలకు అద్దె వసూలు చేయడం,జెండా స్తంభాలు తొలగింపుపై పూర్తి నివేదిక ఇచ్చేందుకు నాలుగు వారాలు అవకాశమివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దీంతో న్యాయమూర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నగరంలో 31 శాతం మాత్రమే జెండా స్తంభాల తొలగింపుకు కారణమేంటి? హైకోర్టు ఉత్తర్వులు వంద శాతం అమలుచేయడంలో తలెత్తిన ఇబ్బందులు ఏమిటీ? రోడ్ల మధ్యలోని డివైడర్లపై పార్టీ జెండా స్తంభాల ఏర్పాటుకు ప్రభుత్వం ఎందుకు అనుమతిస్తోంది? మనుషుల ప్రాణాలకు తగిన భద్రత కల్పించరా?" అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. అనంతరం ప్రభుత్వం కోరిన గడువు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, ఉత్తర్వుల అమలుకు ఈ నెల 24వ తేది వరకు అవకాశం కల్పిస్తూ తదుపరి విచారణ వాయిదావేశారు. అలాగే, బహిరంగ ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన జెండా స్తంభాలు పూర్తిగా తొలగించని జిల్లా కలెక్టర్లు నేరుగా విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని న్యాయమూర్తి హెచ్చరించారు.

ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్‌కు బదిలీ: సీపీఎం

జెండా స్తంభాల కేసును ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన బెంచ్‌కు బదిలీ చేయాలని సీపీఎం అభ్యర్థించింది. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు చేపట్టిన పోరాటాల ఫలితంగా సమస్యల పరిష్కారం, పార్టీ కోసం పనిచేసిన నేతలను స్మరించుకునేలా పార్టీ జెండాలు ఏర్పాటుచేస్తుంటాయని, అలాంటి జెండా స్తంభాలు తొలగించాలనే హైకోర్టు ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ సీపీఎం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ క్రమంలో, ఈ పిటిషన్ విచారణ ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి బదిలీ చేయాలని సీపీఎం తరఫున హైకోర్టు చీఫ్ రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- రాష్ట్రంలో 208 అర్బన్ వెల్‌నెస్ సెంటర్లు
- ప్రారంభించిన సీఎం స్టాలిన్



శాస్త్రినగర్‌లో ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించి, పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్పొరేషన్, మునిసిపాలిటీల పరిధిలో రూ 52, కోట్లతో నిర్మించిన 208 నగర ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను (అర్బన్ వెల్‌నెస్ సెంటర్స్), రూ.60 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. అడయార్ శాస్త్రినగర్‌లో రాష్ట్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో గురువారం ఉదయం వీటిని ప్రారంభించారు. తలా రూ.25లక్షలతో ఈ నగర ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను నిర్మించారు. ఆ తర్వాత అడయార్, శాస్త్రినగర్‌లో నిర్మించిన నగర ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి నగర ఆరోగ్య సంరక్షణ కేంద్రం లోనూ ఓ వైద్యుడు, నర్సు, హెల్త్ వర్కర్, సహాయకుడు చొప్పున నలుగురు వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు ఈ నగర ఆరోగ్య సంరక్షణ కేంద్రం పరిధిలో ఉన్న సుమారు 20 నుండి 25 వేల మంది ప్రజలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 8 గంటల వరకు అందుబాటులో ఉంటూ అందరికీ ఆరోగ్య పథకం కింద వైద్యసేవలందిస్తారని వివరించారు. ఈ కేంద్రాలలో చిన్నారులకు వైద్యసేవలు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, వ్యాధి నిరోధక చికిత్సలు, కన్ను, చెవి, ముక్కుకు చికిత్సలు అందిస్తారని తెలిపారు. అంతే కాకుండా ఈ-సంజీవని యాప్ ద్వారా నగర ఆరోగ్య సంరక్షణ కేంద్రంలోనే అవసరమైన రోగులకు సీనియర్ వైద్యులు సలహాలిస్తారని తెలిపారు. ఈరోడ్ జిల్లా మూలపాళయం, కృష్ణగిరి జిల్లా కామరాజర్ నగర్, మదురై జిల్లా అరపాళయం, ఎస్ ఆలంకుళం, నామక్కల్ జిల్లా నామక్కల్, తిరుప్పూరు జిల్లా కుళత్తుపాళయం, కోయంబత్తూరు జిల్లా మణియకారన్‌పాళయం, కన్నియాకుమారి జిల్లా పెరువిళై, రామనాథపురం జిల్లా రామనాథపురం, సేలం జిల్లా తాతంబట్టి, శివగంగ జిల్లా మానామదురై, మైలాడుదురై జిల్లా మైలాడుదురై, నీలగిర ఇజిల్లా కున్నూరు, తిరువళ్లువర్ జిల్లా ఆవడి, పుదుకోట జిల్లా అశోక్‌నగర్, తిరునల్వేలి జిల్లా మేల్‌పాళయం, తిరుచ్చి జిల్లా పంజప్పూరు, అరియమంగళం, వేలూరు జిల్లా ఒట్టేరి, కాట్పాడి, కరూరు జిల్లా వెంగమేడు ప్రాంతాల్లో ఈ నగర ఆరోగ్య సరంక్షణ కేంద్రాలు పనిచేస్తాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియా, ఎంపీ కనిమొళి సోము, శాసనసభ్యుడు జేఎంహెచ్ హసన్ మౌలానా, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, వైద్య ఆర్యోగశాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.



మీ తాతగారిలా

మీది కంప్యూటర్ మైండ్!

ఉదయనిధిపై దురైమురుగన్ ప్రశంసల వర్షం



చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తన తాత, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిలాగే చురుకైన నేత అని, జ్ఞాపకశక్తి కూడా అధికమని సీనియర్ మంత్రి దురైమురుగన్ ప్రశంసించారు. వేలూరు జిల్లా కాట్పాడిలో జరిగిన పార్టీ నాయకుడి ఇంటి వివాహ వేడుకల్లో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఉదయనిధి ప్రసంగిస్తూ.. తన రాజకీయ జీవితానికి పునాది వేసింది కాట్పాడి ప్రాంతమేనని, డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ జన్మించిన భూమి ఇదేనని, అంతటి కీర్తిగడించిన కాట్పాడిలో జరిగిన వివాహవేడుకకు హాజరుకావడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టినప్పుడు మొదట ఆశీర్వదించింది దురైమురుగన్ అని, అప్పటిదాకా శాసనసభలో వెనుకవరుసలో కూర్చున్న తాను ఆయన పక్కనే కూర్చున్నానని తెలిపారు. దురైమురుగన్ సలహాలను కూడా పాటిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత దురైమురుగన్ మాట్లాడుతూ ఉదయనిధిని ప్రశంసలవర్షంలో ముంచెత్తారు.కాట్పాడిలో తన కుమారుడు కదిర్ ఆనంద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ప్రచారం చేసినట్లు ఉదయనిధి గుర్తు చేశారని, ఆ విషయం తాను పూర్తిగా మరచిపోయానన్నారు.అయితే ఆయన మరచిపోకుండా ఆ పాత సంగతులను గుర్తు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఉదయనిధి పార్టీపై పట్టుకలిగి ఉండటానికి ఆయన జ్ఞాపకశక్తే కారణమని, పార్టీలో అందరిని గుర్తుంచుకుని కలుపుగోలుపుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

సెయింట్ థామస్ మౌంట్ చర్చికి

అంతర్జాతీయ గుర్తింపు

- పునరుద్ధరించిన చర్చి ప్రారంభోత్సవం
- పోప్ రాయబారి ప్రొఫెసర్ ఫాదర్ లియో బోల్డె జర్లీ



ప్రత్యేక ఆరాధనలో పాల్గొన్న క్యాథలిక్ బిషప్‌లు

ప్యారీస్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నైలో 502యేళ్ళ చరిత్ర కలిగిన పురాతన సెయింట్ థామస్ మౌంట్ చర్చికి అంతర్జాతీయ గుర్తింపు ప్రకటించిన నేపథ్యంలో, పునరుద్ధరించిన ఆలయాన్ని పోప్ భారత రాయబారి ఫాదర్ లియో బోల్డె జర్లీ గురువారం ప్రారంభించారు.ఈ ఆలయ ఫాదర్ ఏటీ మైకెల్, చెంగల్పట్టు బిషప్ మీదినాథన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పోప్ భారత రాయబారి ఫాదర్ లియో బోల్డె జర్లీ, విశిష్ట అతిథులుగా వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్ బాసలికాలో ఇటీవల భారత దేశం తరఫున కార్డినల్‌గా బాధ్యతలు స్వీకరించిన హైదరాబాద్ ఆర్చ్ బిషప్, రెవ.డా.పూల ఆంథోని, ముంబయి మాజీ బిషప్ ఆస్వాల్ గ్రేసియస్, చెన్నై మైలాపూర్ ఆర్చ్ బిషప్ జార్జ్ ఆంథోనిస్వామి, పుదుచ్చేరి ఆర్చి బిషప్ ఫ్రాన్సిస్, మాజీ బిషప్ చిన్నప్పతో పాటు పలువురు క్యాథలిక్ ఫాదర్లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ ప్రార్థనా మందిరాన్ని 1547-1707వ సంవత్సరాల మధ్య విస్తవింపజేయగా,. పోప్ భారతరాయబారి 2011 జనవరిలో జాతీయ పుణ్యక్షేత్రంగా అధికారికంగా ప్రకటించారు. అనంతరం 2023 జూలై 3వ తేదీన చెంగల్పట్టు బిషప్ పుణ్యక్షేత్రంగా ప్రకటించారు. అప్పటి నుండి ఈ ఆలయం దశల వారీగా అభివృద్ధి చెందడంతో 2024 ఏప్రిల్‌లో దివంగత పోప్ ఈ ప్రాంతాన్ని బాసలికగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో, 502యేళ్ళ క్రితం గోథిక్ శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన ఈప్రార్థనా మందిరం పురాతన వైభవం చెక్కు చెదరకుండా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం చేసింది.. 13 నెలల పైగా చేపట్టిన పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో గురువారం చర్చి ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీఎం అన్బరసన్, ఎస్ఎం నాజర్, ఆర్.రాజేంద్రన్, ఎంపీ విల్సన్, మాజీ ఎంపీ పీటర్ అల్ఫోన్స్, ఎమ్మెల్యే కరుణానిధి, తమిళనాడు టెస్ట్‌బుక్ సొసైటీ అధ్యక్షుడు దిండుగల్ లియోని తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కల్లోలం సృష్టించిన

కోలీవుడ్ డ్రగ్స్‌కేసు

- అన్నాడీఎంకే మాజీ నేత సహా నలుగురి విచారణ

ప్యారీస్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సినీ ప్రముఖులకు కొకైన్ సరఫరా చేసిన వ్యవహారంలో పట్టుబడిన అన్నాడీఎంకే మాజీ నేత ప్రసాద్ సహా నలుగురిని స్పెషల్ క్రైం బ్రాంచ్ పోలీసులు రాత్రంతా విచారణ జరిపారు. నుంగంబాక్కంలో వున్న ఓ బార్‌లో మే 22వ తేదీ మత్తులో రెండు వర్గాల వారు దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకుని అక్కడకు వెళ్లిన పోలీసులు అన్నాడీఎంకే సాంకేతిక విభాగం మాజీ నేత ప్రసాద్‌తో పాటు అతడి అనుచరులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. విచారణలో ప్రసాద్‌తో చేతులు కలిపి సేలం జిల్లా సంగగిరి ప్రాంతానికి చెందిన ప్రదీప్‌కుమార్ (38) సినీ ప్రముఖులకు కొకైన్ సరఫరా చేసి రూ.కోటి వరకు సంపాదించినట్లు తెలిసింది. దీనితో వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన పోలీసులు, ప్రసాద్, ప్రదీప్‌కుమార్ ఇచ్చి సమాచారం ఆధారంగా నటుడు శ్రీకాంత్, కృష్ణ, కెవిన్ (30) అనే ముగ్గురిని అరెస్టు చేసి వారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం పలువురు ప్రముఖ సినీ నటీనటులను వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా సంప్రదించి గత రెండేళ్ళకు పైగా వారికి అవసరమైన మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న విషయం విచారణలో తెలిసింది. ఆఫ్రికా దేశం నుంచి అక్రమంగా తరలించిన కొకైన్‌ను గానాకు చెందిన జాన్ (38)అనే వ్యాపారి నుంచి ప్రసాద్ బృందం కొనుగోలు చేసింది. ఈ నలుగురి వద్ద కొకైన్ విక్రయాలపై పూర్తిస్థాయిలో ఆరు రోజులు విచారణ జరపాలని దర్యాప్తు అధికారులు నిర్ణయం తీసుకుని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నుంగంబాక్కం పోలీసులు ఆ నలుగురిని గురువారం తమ కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపారు. ఈ విచారణ పూర్తైతే ఈ ముఠా వద్ద సినీ ప్రముఖులెవరెవరు మాదకద్రవ్యాన్ని కొనుగోలు చేశారనే విషయం వెలుగులోకి వస్తుందని పోలీసులు తెలిపారు.



ప్రసాద్, జాన్, ప్రదీప్‌కుమార్, కెవిన్

సమాచార దర్శిని

పురావస్తు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కియాలజీ అండ్ మ్యూజియాలజీలో ఏడాది, రెండేళ్ల పూర్తికాల పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్కియాలజీ, ఎపిగ్రఫీ, హెరిటేజ్ మేనేజ్‌మెంట్, మ్యూజియాలజీ తదితర కోర్సుల్లో చేరందుకు ఆసక్తిఉన్న విద్యార్థులు www.tnarch.org.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని పురావస్తు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కొడైకెనాల్‌లో ఈ-పాస్ విధానం కొనసాగింపు

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌కు వచ్చే పర్యాటకుల వాహనాలకు అమలుచేస్తున్న ఈ-పాస్ విధానం కొనసాగుతుందని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రకారం, సాధారణ రోజుల్లో 4,000 వాహనాలు, వారాంతపు రోజుల్లో 6,000 వాహనాలకు ఈ-పాస్ అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు వస్తున్న నీరు 25,500 ఘనపుటడుగుల నుండి 21,124 ఘనపుటడుగులకు తగ్గింది. డ్యాం నుంచి 22,067 ఘనపుటడుగులు, 12 క్రస్ట్ గేట్ల ద్వారా డెల్టాకు సాగునీరు విడుదల చేస్తున్నారు. డ్యాం నీటి మట్టం 119.91 ఘనపుటడుగుల చొప్పున 93.32 అడుగులుగా ఉందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రిప్పన్ భవనంలో కొత్త సమావేశ మందిరం

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిప్పన్ భవనంలో కొత్త సమావేశ మందిరాన్ని రూ.62.37 కోట్లతో నిర్మించనున్నారు. కొత్త హాలు నిర్మాణ పనులు చేపట్టేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. 24 నెలల్లో కొత్త సమావేశ హాలు నిర్మాణం ముగించాలని జీసీసీ నిర్ణయించింది.

ఆన్‌లైన్‌లో ఛార్జింగ్ కేంద్రాల వివరాలు

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు ఛార్జింగ్ కేంద్రాలు తెలుసుకునేలా ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు గ్రీన్ ఎలక్ట్రిసిటీ బోర్డు తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగింది. ఈ నేపథ్యంలో, విద్యుత్ వాహనాలకు క్రమం తప్పకుండా ఛార్జింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లిన వాహన చోదకులు, తమ సమీపంలోని ఛార్జింగ్ కేంద్రం ఎక్కడ ఉంది? అని సమాచారం తెలుసుకునేలా ev.charging@tnebnet.org అనే వెబ్‌సైట్, 892587239 అనే మొబైల్ నెంబరు పరిచయం చేసినట్లు గ్రీన్ ఎలక్ట్రిసిటీ బోర్డు తెలియజేసింది.

డీలక్స్ బస్సు ధరలతో విద్యుత్ బస్సులు

● మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల్లో డీలక్స్ బస్సుల ఛార్జీలే ఉంటాయని మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో తొలిసారిగా ఎంటీసీ రూ.208 కోట్లతో కొనుగోలు చేసిన 120 విద్యుత్ బస్సులను గత నెల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ బస్సుల్లో డీలక్స్ బస్ ఛార్జీలు వసూలుచేస్తున్నట్లు ఎంటీసీ తెలిపింది. అలాగే, 'విడియల్ పయనం' కింద మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం విద్యుత్ బస్సుల్లో ఉండవు. అదే సమయంలో, నెలవారీ బస్ పాస్ రూ.1,000 కలిగిన వారు ఈ బస్సుల్లో ప్రయాణించవచ్చని ఎంటీసీ తెలిపింది.

పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

● దరఖాస్తులు ఆహ్వానిస్తున్న మద్రాసు ఐఐటీ

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు అర్హులైన విద్యార్థుల నుంచి మద్రాసు ఐఐటీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మద్రాసు ఐఐటీ పీఎస్ డేటా సైన్స్ అండ్ ఏఐ, పీఎస్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ తదితర రెండు రకాల ఆన్‌లైన్ కోర్సులు అందిస్తోంది. ఆ ప్రకారం, ప్లస్ వన్, ప్లస్ టూ, టెన్త్ విద్యార్థులకు ఏఐ, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్ సిస్టమ్, ఆర్కిటెక్చర్ డిజైన్, ఇంజనీరింగ్ బయాలజికల్ సిస్టమ్, చట్టాలకు సంబంధించి 10 ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు పరిచయం చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆగస్టు, అక్టోబరు, జనవరి అని మూడు విడతలుగా ఈ కోర్సులు నిర్వహించనున్నారు. ఆగస్టుకు సంబంధించి ఈ కోర్సుల్లో చేరగోరు విద్యార్థులు code.iitm.ac.in/schoolconnect అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని మద్రాసు ఐఐటీ డైరెక్టర్ కామకోటి ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలో 34 పట్టణ పంచాయతీల హోదా పెంపు

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 34 పట్టణ పంచాయతీల హోదా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, 12 ద్వితీయ శ్రేణి పట్టణ పంచాయతీలను మొదటి శ్రేణి పట్టణ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. 10 ఎంపిక స్థాయి పట్టణ పంచాయతీలను ప్రత్యేక స్థాయి పట్టణ పంచాయతీలుగా, 8 ప్రథమ శ్రేణి పట్టణ పంచాయతీలను ఎంపిక స్థాయి ప్రత్యేక పట్టణ పంచాయతీలుగా అప్ గ్రేడ్ చేయనున్నారు. అలాగే, 3 ప్రథమ శ్రేణి పట్టణ పంచాయతీలను స్పెషల్ క్లాస్ పట్టణ పంచాయతీలుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.కార్తికేయన్ ఉత్తర్వులు జారీచేశారు.

విమాన సేవలు రద్దు చేసిన 'ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్'

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి బయల్దేరే 9 విమాన సేవలను ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ హఠాత్తుగా రద్దు చేసింది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ నగరం నుంచి దేశంలోని పలు నగరాలకు విమానాలు నడుపుతోంది. గత ఆరు నెలలుగా జైపూర్, భువనేశ్వర్, గోవా, అండమాన్ తదితర ప్రాంతాలకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభించింది. ఆ సంస్థ నగరం నుంచి మరిన్ని నగరాలకు కొత్తగా విమాన సేవలు అందిస్తుందని ఎదురుచూస్తున్న నేపథ్యంలో, 9 విమాన సేవలు హఠాత్తుగా రద్దు చేయడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆ సంస్థ సమాచార ప్రతినిధి మాట్లాడుతూ... తమ నెట్‌వర్క్ మెరుగుపరచడానికి విమాన సేవలు పునరుద్ధరించనున్నామని, అందులో భాగంగా 9 విమాన సేవలు రద్దు చేశామని, త్వరలో కొత్త సేవలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో 12 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవన వర్షాలతో గురువారం వరకు 12 శాతం అదనపు వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఆ ప్రకారం, రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 55.5 మి.మీ కాగా 12 శాతం అదనంగా 61.9 మి.మీ నమోదైంది.

'ఏకతాటిపై తమిళనాడు'

● ఇంటింటా ప్రచారం ప్రారంభించిన స్టాలిన్

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): 'ఏకతాడిపై తమిళనాడు' అనే పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ఉదయం ఆళ్వార్‌పేటలో ప్రారంభించారు. జాతిమతాలకు, రాజకీయాలకు అతీతంగా తమిళసీమ, తమిళ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలనే సంకల్పంతోనే తాను ఈ ప్రచార కార్యక్రమాన్ని గత మంగళవారం ప్రారంభించానని, ఇందుకు ప్రజల మద్దతు అవసరమని చెప్పారు. డీఎంకే జిల్లా కార్యదర్శులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, పార్టీ సీనియర్లు 45 రోజులపాటు ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నారని స్టాలిన్ తెలిపారు. ఆళ్వారోపేటలో కొన్నిళ్లవద్దకు స్టాలిన్ నడచుకుంటూ వెళ్ళి కొన్ని ప్రశ్నలతో ఉన్న కరపత్రాలు అందించి వాటిని భర్తీ చేసి ఇవ్వమని కోరారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు ఘనస్వాగతంపలికారు. తమిళ సంప్రదాయాన్ని తమిళ సీమను మతతత్త్వశక్తుల నుండి కాపాడుతామని శపథం చేస్తామని మహిళలు పేర్కొన్నారు. రాష్ట్ర హక్కులను పరిరక్షించడానికే ఈ ప్రచారోద్యమాన్ని జరుపుతున్నామని, ఇందుకు ప్రజలంతా గట్టి మద్దతు ఇవ్వాలని కోరారు.



ఆళ్వార్‌పేటలో మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బస్సు ధ్వంసం

ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు సమీపంలో అదుపు తప్పిన ప్రైవేటు బస్సు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొని ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణించినవారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. కుంభకోణం నుండి 36 మంది ప్రయాణికులతో కోవై బయలుదేరిన ఆ బస్సును రాబర్ట్ అనే డ్రైవర్ నడిపాడు. ఆ బస్సు గురువారం వేకువజాము తిరుప్పూరు సమీపంలోని పొంగలూరు వద్ద వెళుతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికులు స్వల్ప గాయాలతో ప్రాణగండం నుండి బయటపడ్డారు.



ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో అవినీతి

● సెంథిల్ బాలాజీపై కేసు నమోదుకు వారంలో నిర్ణయం

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ సహా పలువురికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుకు అనుమతిచ్చేందుకు వారంలో నిర్ణయం తీసుకుంటామని మద్రాసు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మద్రాసు హైకోర్టులో అరప్పోర్ ఇయక్కం తరఫున దాఖలైన పిటిషన్‌లో... రాష్ట్రంలో 2021-23 సంవత్సరాల మధ్య 45,800 ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు రూ.1,182.88 కోట్ల మేర టెండర్లు ఆహ్వానించారని, టెండర్ల పత్రాలు పరిశీలించగా కాంట్రాక్టర్‌కు లాభాలు, ప్రభుత్వానికి రూ.397 కోట్లు నష్టం వాటిల్లిందని, ఈ వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖ అందజేసిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ అవినీతిలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజి, టాన్‌జెడ్కో ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ లఖానీ ఇతరులను అనుమానించేలా ఆధారాలున్నాయని, హైకోర్టు పర్యవేక్షణలో ఈ అవినీతిపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం నియమించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి వేల్‌మురుగన్ గురువారం విచారించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వొకేట్ జనరల్ పీఎస్ రామన్... పిటిషనర్ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదుకు అనుమతిచ్చేందుకు సంబంధిత అధికారులు ఒక వారంలో నిర్ణయం తీసుకుంటారని, అందువల్ల ఈ పిటిషన్ చెల్లదని వాదించారు. ఆ సమయంలో ఇయక్కం తరఫున హాజరైన న్యాయవాది సురేష్... ఫిర్యాదు చేసి రెండేళ్లు గడిచాయని, అన్ని పత్రాలను సమాచార హక్కు చట్టం ద్వారా పొందామని, పిటిషన్‌పై వివరణాత్మక వాదన సమర్పించేందుకు సోమవారానికి వాయిదా వేయాలని అభ్యర్థించారు. ఈ వాదనల అనంతరం న్యాయమూర్తి, అరప్పోర్ ఇయక్కం దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ తేది ప్రకటించకుండా వాయిదావేశారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు

సీబీఐకి బదిలీ చేయాలంటూ పిటిషన్

● పోలీసు శాఖకు హైకోర్టు నోటీసు

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు విచారణ సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన కేసులో మద్రాసు హైకోర్టు పోలీసు శాఖకు నోటీసు జారీచేసింది. ఆమ్‌స్ట్రాంగ్ గత ఏడాది జూలై 5న హత్యకు గురయ్యారు. ఈ కేసులో ఇప్పటివరకు 27 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ ఆమ్‌స్ట్రాంగ్ సోదరుడు కినోస్ ఆమ్‌స్ట్రాంగ్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో... జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో పలు రాజకీయ పార్టీలకు ప్రమేయం ఉందనే అనుమానాలున్నాయని, ఈ కేసులో రాష్ట్ర పోలీసు శాఖ స్వతంత్రంగా విచారించే అవకాశం లేదని, ఈ కేసులో ప్రమేమం ఉన్న 'శంభో' సెంథిల్, మొట్టై కృష్ణన్ ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని, ఈ కేసు సమగ్ర విచారణ చేపట్టేలా సీబీఐకి మార్చాలంటూ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను గురువారం న్యాయమూర్తి పి.వేల్‌మురుగన్ విచారించగా పోలీసు శాఖ తరఫున హాజరైన న్యాయవాది... ఈ కేసులో ఛార్జిషీటు దాఖలుచేసినట్లు తెలిపారు. అనంతరం న్యాయమూర్తి, ఈ పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని పోలీసు శాఖకు నోటీసు జారీచేసి, విచారణ వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మృత్యువులోనూ వీడని అనుబంధం

● తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక సోదరుడి మృతి

వేలూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల ప్రాయం నుండి 75 యేళ్ల వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన తమ్ముడు ఆకస్మికంగా మృతి చెందటంతో ఆ బాధ తట్టుకోలేక అతడి సోదరుడు మృతదేహంపై పడి ప్రాణాలు విడిచాడు. వేలూరు జిల్లా ఒడకత్తూరు సమీపంలోని కోట్టావూరు గ్రామంలో జరిగిన ఈ సంఘటన గ్రామస్థుల కంట తడిపెట్టించింది. ఆ గ్రామంలో జయరామన్ (85), బలరామన్ (80) అనే అన్నదమ్ములు నివసిస్తున్నారు. ఇద్దరూ రైతులు. వీరికి ఇద్దరేసి కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఐదేళ్ల క్రితం వారిద్దరి భార్యలు మృతి చెందారు. ఆ తర్వాత అన్నదమ్ములు ఇద్దరూ ఒకే ఇంటిలో నివసిస్తూ పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మూడేళ క్రితం బలరామన్ కాలు విరిగి మంచానికే పరిమితమయ్యారు.. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం బలరామన్ చెందాడు. దీంతో అతడి సోదరుడు జయరామన్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కలిసి జయరామన్ అంత్యక్రియల ఏర్పాట్లు చేపట్టారు. ఇంటి నుండి వెలుపలకు వచ్చిన జయరామన్ తను అల్లారు ముద్దుగా పెంచిన తమ్ముడు బలరామన్ మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తూ కుప్పకూలిపడ్డాడు. తమ్ముడి దేహంపై పడిన జయరామన్‌ను బంధువులు లేపేందుకు ప్రయత్నించినా లేవలేదు. ఆ తర్వాత పరీక్షించి చూడగా జయరామన్ మృతి చెందినట్లు తెలుసుకుని శోకతప్తులయ్యారు. చివరకు భారమైన మనస్సుతో ఆ అన్నదమ్ముల అంత్యక్రియలను కుటుంబ సభ్యులు, స్థానికులు ఘనంగా జరిపించారు.



జయరామన్, బలరామన్ (ఫైల్‌ఫొటో)

● పెట్రోల్ బంకు యజమాని హత్యకేసు ..

డీపీఐ నేత సహా నలుగురి లొంగుబాటు

ప్యారీస్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కల్పాక్కం ప్రాంతంలో పెట్రోల్ బంకు యజమాని మోహన్‌రాజ్ (55)హత్య కేసులో డీపీఐ ప్రముఖుడితో సహా నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్యచేసి మూడురోజులుగా కళ్లుగప్పి తిరుగుతున్న వారి కోసం మహాబలిపురం డీఎస్పీ అరివిలగన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం గాలిస్తోంది. నేపథ్యంలో, కూవత్తూరు ప్రాంతానికి చెందిన డీపీఐ నాయకుడు రఘు అతడి అనుచరులు దక్షిణామూర్తి, రవీంద్ర, కదిర్‌లు గురువారం మహాబలిపురం సమీపంలోని తిరుక్కలికుండ్రం కోర్టులో లొంగిపోయి పాత కక్షల కారణంగా మోహన్‌రాజ్‌ను హతమార్చినట్లు కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా శుక్రవారం నుంచి 6వ తేది వరకు 1,030 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు ఎస్‌ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుండి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 325, శనివారం 375 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు టెర్మినల్ నుండి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుండి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల నుంచి పలు ప్రాంతాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

తిరుచెందూర్ ఉత్సవాలకు ...

తిరుచెందూర్ మురుగన్ ఆలయ కుంభాభిషేకం ఈ నెల 7వ తేది జరుగనుంది. ఈ ఉత్సవాలకు వెళ్లే భక్తుల సౌకార్యర్థం శుక్రవారం నుంచి 6వ తేది వరకు చెన్నై, తిరుచ్చి, పుదుచ్చేరి, కుంభకోణం, సేలం, బెంగళూరు, తంజావూరు, కోయంబత్తూర్, ఈరోడ్, నాగపట్టణం తదితర ప్రాంతాల నుంచి తిరుచెందూర్‌కు 400 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

గొంతులో విత్తనం చిక్కుకుని బాలుడి మృతి

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పండు విత్తనం గొంతులో చిక్కుకుని ఐదేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన తిరునల్వేలిలో చోటుచేసుకుంది. మేలపాళయం వెస్ట్ తెక్కా వీధికి చెందిన నిజామ్‌కు రియాజ్ (5) అనే కుమారుడున్నాడు. నిజామ్ విదేశాల్లో ఉద్యోగం చేస్తుండడంతో, అతని తల్లిదండ్రులతో నిజామ్ బార్య, కుమారుడితో ఉంటోంది. రియాజ్‌కు బుధవారం రాత్రి తాత రాంబూటాన్ పండు ఇచ్చారు. రియాజ్ పండును ఆత్రంగా తిన్న కొద్దిసేపటికి విత్తనం అతని గొంతులో చిక్కుకోవడంతో శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడాడు. కుటుంబ సభ్యులు రియాజ్‌ను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

చేపల వేటకు వెళ్లిన ఇద్దరు జాలర్ల గల్లంతు

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూర్ సముద్ర తీరంలో పడవ బోల్తా పడిన ఘటనలో నలుగురు జాలర్లను రక్షించిన నేపథ్యంలో, మరో ఇద్దరు గల్లంతయ్యారు. కాశిమేడుకు చెందిన శ్రీధర్‌కు సొంతమైన పడవలో గురువారం ఉదయం ఆరుగురు చేపల వేటకు వెళ్లారు. సుముద్రంలో చేపలు పడుతుండగా పడవ బోల్తాపడి ఆరుగురు జాలర్లు నీట మునిగారు. సమీపంలోని జాలర్లు వెంటనే నలుగురిని రక్షించగా, ఇద్దరు గల్లంతయ్యారు. వారి కోసం మెరైన్ పోలీసులు, జాలర్లు గాలిస్తున్నారు.

అజిత్‌కుమార్‌పై ఫిర్యాదు చేసిన నిఖితాపై పలు నేరారోపణలు

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనంలో ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌పై నగలు కాజేసినట్లు ఫిర్యాదు చేసిన నిఖితా అనే మహిళపై పలు పోలీసుస్టేషన్లలో మోసం కేసులున్నాయని, ముఖ్యంగా ఉద్యోగాలిప్పిస్తానంటూ పలువురి వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించినట్లు వెల్లడైంది. అజిత్‌కుమార్ లాకప్‌డెత్ సంఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఆమెను విచారించకపోవడంపై ప్రధాన రాజకీయ పార్టీల నేతలు తీవ్ర నిరసన ప్రకటిస్తున్నారు. మదురై జిల్లా తిరుమంగళం సమీపం ఆలంపట్టిలో నిఖిత నివసిస్తోంది. దిండుగల్ ప్రభుత్వ కాలేజీలో పనిచేస్తున్న నిఖితా తన తల్లితోపాటు మడపురం ఆలయానికి వెళ్ళినప్పుడే కారులో నగలను కాజేశాడంటూ ఆ ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా అతడిని విచారణ పేరుతో రోజంతా పలు ప్రదేశాలకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. మరుసటి రోజు అజిత్‌కుమార్ మృతిచెందినట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారు. చివరకు పోలీసుల దాడి వల్లే అజిత్‌కుమార్ మృతిచెందినట్లు వెల్లడి కావడంతో ఐదుగురు కానిస్టేబుళ్లను అరెస్టు చేసి, ఎస్పీని బదిలీ చేశారు.. ఈ నేపథ్యంలో నిఖిత ఆమె కుటుంబీకులు ప్రస్తుతం ఇల్లు విడిచి పారిపోయారు. నిఖిత ఆమె తల్లి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిఖిత ఆమె తల్లి వలన మోసపోయినవారంతా పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో వారి మోసాలు వరుసగా వెల్లడవుతున్నాయి.

లాకప్‌డెత్‌పై

రెండో రోజూ న్యాయమూర్తి విచారణ

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనంలో అమ్మవారి ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ లాకప్‌డెత్‌పై మదురై జిల్లా అడిషనల్ జడ్జి జాన్‌సుందర్ లాల్ సురేష్ గురువారం కూడా విచారణ కొనసాగించారు. అజిత్‌కుమార్ లాకప్‌డెత్‌పై విచారణ జరిపిన హైకోర్టు మదురై డివిజన్ ఆదేశాల మేరకు జడ్జి జాన్‌సుందర్‌లాల్ బుధవారం ఉదయం తన విచారణ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన పత్రాలు, సీసీ ఫటేజీ, పోస్టుమార్టం నివేదిక పరిశీలించారు. అనంతరం అజిత్‌కుమార్ పనిచేసిన మడపురం ఆలయ సిబ్బందిని కలిసి విచారణ జరిపారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న పెరియసామి, డ్రైవర్ కార్తికేయన్, సెక్యూరిటీ గార్డులు కుమార్, వినోద్‌కుమార్, ఆలయ సీసీ కెమెరా ఆపరేటర్ శీనివాసన్, ప్రవీణ్, నగలు మాయమైన కారు పార్కింగ్‌చేసిన అరుణ్ సహా మొత్తం 12 మంది వద్ద ఆయన విచారణ జరిపారు. గురువారం ఉదయం అజిత్‌కుమార్‌ను పోలీసులు చితకబాదుతున్న దృశ్యాలను వీడియో తీసిన శక్తీశ్వరన్, ఆలయ సెక్యూరిటీ వినోద్, పెరియసామి, ప్రభు వద్ద కూడా విచారణ జరిపారు. ఆలయం వద్ద అజిత్‌కుమార్ పనిచేసిన తీరు, భక్తులతో నడుచుకునే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. నగలు మాయమైనట్లు ఫిర్యాదు చేసిన నిఖిత ఆలయానికి వచ్చిన సమయం, ఆ సందర్భంగా జరిగిన సంభాషణ గురించి కూడా ఆయన ప్రశ్నించారు. ఆ తర్వాత అజిత్‌కుమార్‌ను తరలించేందుకు ఉపయోగించిన టెంపో వ్యాన్, అతడిని విచారణ జరిపిన ప్రాంతాల వద్దకు వెళ్ళి విచారణ జరిపారు.



విచారణ కార్యాలయానికి వెళ్తున్న మదురై జిల్లా అడిషనల్ జడ్జి జాన్‌సుందర్‌లాల్ సురేష్

ఉద్యోగుల వారసులకు మ్యారేజ్ అడ్వాన్స్

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కాకుండా వారి వారసులకు మ్యారేజ్ అడ్వాన్స్ అందజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.ఉదయచంద్రన్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో.... ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ విధుల సమయంలో అవసరానికి అనుగుణంగా మ్యారేజ్ అడ్వాన్స్ పొందవచ్చు. ఇప్పటివరకు మహిళలకు రూ.10వేలు, పురుషులకు రూ.6వేలు అందజేస్తున్నారు. ఈ అడ్వాన్స్‌ను రూ.5 లక్షలకు పెంచుతూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా, మ్యారేజ్ అడ్వాన్స్ ప్రభుత్వ ఉద్యోగులు, వారి పిల్లలకు కూడా అందజేయనున్నారు. కుటుంబంలో భార్యా, భర్త లేదా తల్లి, తండ్రి ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటే, వారిలో ఒకరికి మాత్రమే మ్యారేజ్ అడ్వాన్స్ అందజేయనున్నారు. అడ్వాన్స్ నగదు పొందేందుకు ఇతరుల ష్యూరిటీ అవసరం. వివాహ తేదీకి రెండు నెలలు ముందుగానే అడ్వాన్స్ పొందవచ్చు. అడ్వాన్స్‌ను 36 నెలల్లో జమచేయాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

డెల్టా రైతులపై వివక్ష ఎందుకు?

● ప్రభుత్వాన్ని నిలదీసిన ఈపీఎస్

ప్యారీస్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల్లో చివరి ఆయకట్టు వరకు సాగునీరు సక్రమంగా అందించకుండా వివక్ష చూపడం ఎందుకని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఈపీఎస్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో, అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రతిఏడాది డెల్టా జిల్లాల్లో సాగునీటి కాలువల్లో పూడికతీత పూర్తిచేసి, జూన్ నెల 12న మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేసే సాగునీరు చివరి ఆయకట్టు ప్రాంతం వరకు చేరేదన్నారు. అయితే ఈ సంవత్సరం కావేరి పరివాహక ప్రాంతాల్లో ఎలాంటి పూడికతీత పనులు జరపని డీఎంకే ప్రభుత్వం, డెల్టా రైతులను నమ్మించే విధంగా ప్రకటనలను గుప్పించిందని ఆరోపించారు. జూన్ 12న ముఖ్యమంత్రి స్టాలిన్ మేట్టూరు డ్యాం నుండి విడుదల చేసి 20 రోజులు గడిచినా సాగునీరు చివరి ఆయకట్టు ప్రాంతాలకు చేరకపోవడంతో ఆ ప్రాంతాల రైతులు సాగు పనులు చేసుకోలేక నష్టపోయారని ఈపీఎస్ ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా అన్నదాతల కోసం ఆసియా డెవెలెప్మెంట్ బ్యాంక్ పంపిణీ చేస్తున్న నిధులను డీఎంకే పాలకులు వ్యవసాయ పథకాలకు కాకుండా ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మేట్టూరు డ్యాం పూర్తిస్థాయిలో నిండటంతో మిగుల జలాలు వృధాగా సముద్రం పాలవుతున్నాయని, ఆ నీటిని రైతులకు సరఫరా చేసేందుకు సీఎం స్టాలిన్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఖండించదగ్గదన్నారు. సాగునీరు కోసం తంజావూరు, తిరువారూర్, నాగపట్నం జిల్లాల చివరి ఆయకట్టు ప్రాంతాలకు చెందిన రైతుల విజ్ఞప్తుల మేరకు తమ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈపీఎస్ తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ఉదయం వివాహం...సాయంత్రం ప్రియుడితో జంప్

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్ అంబేడ్కర్ నగర్ చెందిన అఖిలన్-నాగవల్లి దంపతుల కుమార్తె అర్చన (20)కు మాధవరం బర్మా కాలనీకి చెందిన జయకుమార్‌కు బుధవారం ఇరు కుటుంబాల సమక్షంలో వివాహం జరిగింది. వివాహం అనంతరం వధూవరులను యువతి ఇంటికి తీసుకొచ్చారు. సాయంత్రం వివాహ రిసెప్షన్ జరగాల్సి ఉండగా, మధ్యాహ్నం బ్యూటీ పార్లర్‌కు వెళ్తున్నానని బయటకు వెళ్లిన అర్చన సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, బంధువులు ఆమె కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయమై వారు చుట్టుపక్కల వారిని విచారించగా, అర్చన ఇదివరకే ఎరుకంజేరికి చెందిన కలైఅరసన్ అనే యువకుడిని ప్రేమిస్తున్నట్లు తెలిసింది. దీంతో, తన కుమార్తెను అప్పగించాలంటూ తల్లి నాగవల్లి తిరువిక నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, పరారైన ప్రేమ జంట కోసం గాలిస్తున్నారు.

కపాలీశ్వరాలయానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ కపాలీశ్వరాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపు విషయాన్ని ఆలయ ఉద్యోగులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో అక్కడకు వెళ్లి, ఆలయ ప్రాంగణం, పరిసరాలను తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. అలాగే, బాంబు బెదిరింపు వచ్చిన ఈ-మెయిల్ చిరునామా కోసం పోలీసులు విచారిస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక దురైపాక్కంలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. దురైపాక్కం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలిక కొన్నేళ్ల క్రితం వేసవి సెలవుల్లో టైలరింగ్ శిక్షణకు వెళ్లింది.. ఆ సమయంలో విక్కీ అలియాస్ విఘ్నేష్ బాలికతో పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించిన విఘ్నేష్ బాలికతో ఫోన్‌లో మాట్లాడేవాడు. తనను వివాహం చేసుకోవాలని, లేకపోతే ఆత్మహత్యకు పాల్పడతానని విఘ్నేష్ బాలికను బెదిరించినట్లు సమాచారం. 2021 జనవరి 14న తన సోదరుడు ఇంటికి బాలికను తీసుకెళ్లిన విఘ్నేష్, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆమెను లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు దురైపాక్కం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విఘ్నేష్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారించిన చెంగల్పట్టు పోక్సో కోర్టు... నేరం నిరూపణ కావడంతో విఘ్నేష్‌కు 20 ఏళ్ల జైలు, రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అలాగే, బాధితురాలికి రూ.3.50 లక్షలు పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటోను సరుకు లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. విల్లుపురం జిల్లా బేలాకుప్పం ప్రాంతానికి చెందిన పృథ్వీరాజ్ భార్య సుధ (21) సోదరి కనిపించకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం అదే ప్రాంతానికి చెందిన మహేష్‌కుమార్ ఆటోలో పృథ్వీరాజ్, సుధ, బంధువు భానుశ్రీ కలసి బుధవారం రాత్రి పలు ప్రాంతాల్లో వెతకసాగారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో సెంజి-చెన్నై బైపాస్ రోడ్డులో అయ్యంతోపు సమీపంలో వస్తున్న ఆటోను మినీ సరుకుల లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జుకాగా, క్షతగాత్రులను దిండివనం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే సుధ మృతిచెందినట్లు నిర్ధారించిన వైద్యులు, గాయపడిన ముగ్గురిని ప్రాథమిక చికిత్స అనంతరం పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక భానుశ్రీ మృతిచెందింది. ఈ ఘటన అనంతరం మినీ లారీ డ్రైవర్ చెన్నై భరణిపురానికి చెందిన అరుళ్‌దాస్ విల్లుపురం ముండియంబాక్కం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

పెరంబూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ రోడ్డుపై చేరిన వరద నీటిలో విద్యుత్ తీగ పడడంతో విద్యుదాఘాతానికి గురై ప్లస్ టూ విద్యార్థి మృతిచెందాడు. తిరువొత్తియూర్ తాంగల్ బీర్ పయిల్వాతురై ప్రాంతానికి చెందిన అల్తాఫ్ కుమారుడు నవబిల్ (17) అదే ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్నాడు. బుధవారం రాత్రి ట్యూషన్ నుంచి నవబిల్ ఇంటికి బయల్దేరాడు. ఆ సమయంలో కురిసిన వర్షానికి ఇంటి సమీపంలో చేరిన నీటిలో విద్యుత్ తీగ తెగిపడింది. దీనిని గమనించని నవబిల్ నీళ్లలో కాలు పెట్టిన వెంటనే విద్యుదాఘాతానికి గురయ్యాడు. అది చూసిన చుట్టుపక్కల వారు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తిరువొత్తియూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



నవబిల్ (ఫైల్‌ఫొటో)

చిత్రజ్యోతి



గౌతమ్ కార్తీక్, భవ్య త్రిఖ, అపరశక్తి ఖురానా

గౌతమ్ కార్తీక్ - భవ్య జంటగా కొత్త చిత్రం

యువ నటుడు గౌతమ్ కార్తీక్ - భవ్య త్రిఖ జంటగా కొత్త చిత్రం పూజా కార్యక్రమంతో మొదలైంది. 'రూట్ - రన్నింగ్ ఔట్ ఆఫ్ టైమ్' అనే టైటిల్ ఖరారు చేసిన ఈ మూవీ ద్వారా బాలీవుడ్ నటుడు అపరశక్తి ఖురానా కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తున్నారు. వెరస్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించే ప్రతిష్ఠాత్మక చిత్రానికి సూర్యప్రతాప్.ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఈ మూవీని ధనిష్టన్ ఫెర్నాండో, రాజరాజన్ గణనసంబంధం, సంజయ్ శంకర్, షేక్ ముజీబ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దర్శకుడు సూర్యప్రతాప్ మాట్లాడుతూ, 'ఈ మూవీ స్క్రిప్టు దశ నుంచే ఒక ప్యాషన్ ప్రాజెక్టుగా మారింది. ఇది ఫిక్షన్ నేపథ్యంలో నడిచే భావోద్వేగపరంగా ప్రతిధ్వనించే పాత్రలతో, ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ మూవీ. గౌతమ్ కార్తీక్ పోలీస్ పాత్రలో నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అపరశక్తి ఖురానాను తమిళ చిత్రపరిశ్రమకు ఆహ్వానిస్తున్నాం. ఆయన ఒక గొప్ప నటుడు. గౌతమ్ - ఖురానాల మధ్య సన్నివేశాలు హైలెట్‌గా నిలిచి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని మిగుల్చుతాయి అని బలంగా నమ్ముతున్నాను' అని పేర్కొన్నారు.

మరో లెస్బియన్ మూవీ 'మరియా'


'మరియా'లో ఓ దృశ్యం

కోలీవుడ్‌లో మరో లెస్బియన్ మూవీ రూపొందింది. 'మరియా' అనే పేరుతో తెరకెక్కిన ఈ చిత్రంలో పావల్ నవనీతం, సాయి శ్రీ ప్రభాకరన్, సింధు కుమరేశన్, విఘ్నేష్ రవి తదితరులు నటించారు. ఈ సినిమా నిర్మించి దర్శకత్వం వహించిన హరి కె. సుందర్ ఈ సినిమా గురించి వివరిస్తూ, 'ఒక స్త్రీకి సహజత్వానికి భిన్నంగా అసాధారణ ఆలోచనలు వస్తాయి. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులతో పాటు చుట్టూ ఉన్న వారికి చెప్పినపుడు వారు ఎలా స్వీకరించారు.? తద్వారా ఆమె ఎదుర్కొన్న సమస్యలు ఏంటి? ఇలాంటి అంశాలతో ఈ మూవీని తెరకెక్కించాం. నేను దర్శకత్వం వహించిన తొలి చిత్రం ఇది. హాలీవుడ్ దర్శకుడు స్టాన్లీ కుబ్రిక్ సినిమాల ప్రభావం నాపై చాలా ఎక్కువగా ఉంది. అదే నన్ను దర్శకత్వం వైపు ప్రోత్సహించేలా చేసింది. మలేసియా, లండన్, ఇటలీతో సహా కొన్ని దేశాల చిత్రోత్సవాల్లో ప్రదర్శించడం జరిగింది. ఇందులో ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగాల్లో అవార్డులను గెలుచుకుంది. సినిమాలోని పలు సన్నివేశాలను సెన్సార్ బోర్డు తొలగించి, 'ఏ' సర్టిఫికెట్ మంజూరు చేసింది. ఆగస్టు నెలలో విడుదలకు ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.

ఇక్కడ హోమ్లీగా.. అక్కడ బోల్డ్‌గా...!

తమిళం, తెలుగు భాషల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉన్న హీరోయిన్ రష్మిక మందన్నా.. బాలీవుడ్ అవకాశాల కోసం గ్లామర్‌గా కనిపించేందుకు ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు. కోలీవుడ్, టాలీవుడ్‌లో పక్కా హోమ్లీ గర్ల్ పాత్రల్లో కనిపించే ఈ భామ.. బాలీవుడ్ చిత్రాల్లో మాత్రం ఫుల్ గ్లామరస్ పాత్రల్లో నటించేందుకు ఏమాత్రం వెనుకంజ వేయడం లేదనే టాక్ వుంది. హిందీ చిత్రాల్లో " అవకాశాలను దక్కించుకోవాలన్నా, సంపాదించుకున్న మార్కెట్ నిలబెట్టుకోవాలన్నా.. ఎక్స్‌పోజింగ్ తప్పదన్నది రష్మిక ఆలోచన . అందుకే బాలీవుడ్‌లో జరిగే ఈవెంట్‌లకు హాజరయ్యే సమయంలో ఆమె.. ఎక్స్‌పోజ్ చేసేలా దుస్తులు ధరించి వెళ్తుందనే ప్రచారం లేకపోలేదు. తమిళం, తెలుగు చిత్రాల్లో హోమ్లీ గర్ల్‌గా కనిపించే రష్మిక.. హిందీ చిత్రాల్లో మాత్రం గ్లామర్‌గా కనిపించేందుకు ఎందుకు సమ్మతిస్తున్నారంటూ ఆమె అభిమానులు ప్రశ్నిస్తున్నారు.


రష్మిక మందన్నా



ఖుషి రవి, సెల్వరాఘవన్, కౌసల్య

సెల్వరాఘవన్ ప్రధాన పాత్రలో కొత్త చిత్రం

క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా, స్క్రీన్ రైటర్‌గా రాణిస్తున్న దర్శకుడు సెల్వరాఘవన్ నటించే కొత్త చిత్రం తాజాగా పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. డెన్నిస్ మంజునాథ్ దర్శకుడు. విజయ్ సతీష్ సమర్పణలో 'ఫేమ్ ఎంటర్‌టైన్మెంట్స్' పతాకంపై నిర్మించనున్నారు. ఇందులో ఖుషి రవి, కౌసల్య, మైజీ మహేంద్రన్, మైమ్ గోపి, సతీష్ తదితరులు నటిస్తున్నారు. తొలి దశ షెడ్యూల్ సేలంలో ప్రారంభమైంది. ఈ మూవీ ఫస్ట్ లుక్, టీజర్‌ను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు.

ముక్తిధామం..

తిరువట్టూరు క్షేత్రం


పుష్పాలంకరణతో ఊరేగుతున్న స్వామివారు

- మూడు ద్వారాల్లో ముచ్చటగొలిపే తిరుమాలుడు
- 16వేల సాలగ్రామాలతో మూలవిరాట్టు ఆదికేశవుడు
- కేరళ శిల్పకళా శైలితో నిర్మితమైన ఆలయం


ఆలయ ప్రవేశద్వారం



అష్టోత్తరశత వైష్ణవ దివ్య దేశాల్లో కన్నియాకుమారి జిల్లాలోని తిరువట్టారు ఆదికేశవ పెరుమాళ్ ఆలయం 87వదిగా పిలువబడుతోంది. ఈ ఆలయంలోని పెరుమాళ్ 16,008 సాలగ్రామాల మిశ్రమంతో కూడిన తిరుమేనితో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్షేత్రమహాత్మ్యంపై నమ్మాళ్వార్ మంగళాశాసనమొనర్చారు. చేర దేశ పద్ధతిలో ఈ ఆలయాన్ని నిర్మించారు. అందుకే ఈ దేవాలయంలోకి చొక్కా ధరించిన పురుషులను దర్శనానికి అనుమతించరు. 22 అడుగుల పొడవైన స్వామివారి మూలవిరాట్టు సౌందర్యం వర్ణింపశక్యం కాదు. 'తిరుముఖం, తిరుక్కరం, తిరుపాదం' ఇలా మూడు పవిత్ర మేనులను మూడు ప్రవేశ ద్వారా భక్తులు దర్శించగలిగే అద్భుతాలయం ఇది.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

స్థలపురాణం...

పూర్వం బ్రహ్మదేవుడు యాగం చేస్తున్న సమయంలో జరిగిన చిన్న పొరపాటు కారణంగా హోమ గుండం నుంచి కేశ, కేశి అనే ఇద్దరు రాక్షసులు ఉద్భవించారు. వారిద్దరూ దేవతలను, మునులను చిత్రహింసలు పెట్టేవారు. ఈ బాధలను భరించలేక దేవతలంతా తిరుమాలుడికి మొరపెట్టుకున్నారు. తిరుమాలుడు కేశుని సంహరించి, కేశిపై శయనించారు. ఈ విషయం తెలుసుకుని కేశి భార్య తన భర్తను కాపాడమంటూ గంగాదేవి, తామ్రభరణిని వేడుకుంది. వారిద్దరూ ఆమెకు సాయం చేయాలని తిరుమాలుడిని తమ నీటి ప్రవాహంతో ముంచెత్తాలని భావించారు. ఈ విషయం తెలుసుకుని భూదేవి, తిరుమాలుడు శయనించిన ప్రాంతం ఎత్తు పెంచుకుంటూ వెళ్ళింది. రెండు నదులు ప్రహిస్తున్నప్పుడే వాటి మధ్య తిరుమాలుడు శయనించిన ప్రాంతం ఎత్తు పెరిగి దీవిలా మారింది. చివరకు ఆ రెండు నదులు స్వామివారికి ఏ హాని చేయలేక, ఆ స్థలాన్ని ప్రదక్షిణ చేస్తున్నట్లు ప్రవహించాయి. ఇలా ఈ క్షేత్రానికి రెండు నదులు వలయాకారంలో ప్రవహించడం వల్లే ఈ ప్రాంతానికి 'వట్టారు' (గుండ్రంగా ప్రవహించే వాగులు) అని పేరొచ్చింది. పెరుమాళ్ క్షేత్రంగా ఉండటంతో ఆ వట్టారు అనే పదానికి ముందు 'తిరు' (శ్రీ) అనే పదం చేరి 'తిరువట్టారు'గా రూపాంతరం చెందింది. కేశుడిని సంహరించడం వల్ల ఈ పెరుమాళ్‌ను కేశవపెరుమాళ్ అని పిలుస్తున్నారు. తనపై శయనించిన తిరుమాలుడిని కిందకు నెట్టి పడేయాలని కేశి చేసిన ప్రయత్నాలకు పెరుమాళ్ అడ్డుకట్టవేశారు. ఆ అసురుడి ద్వాదశ హస్తాలకు రుద్రాక్షలు కట్టి తప్పించుకోకుండా అడ్డుకున్నారు. అసురుడి చేతుల్లో ఉన్న 12 రుద్రాక్షలే ఈ ప్రాంతం చుట్టూ ద్వాదశ శైవక్షేత్రాలుగా ఆవిర్భవించాయని స్థలపురాణం.

ఆలయ వైభవం...

మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఈ ప్రాంతంలోని ద్వాదశ శివాలయాలకు ఆధ్యాత్మిక పరుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ చివరకు ఆదికేశవపెరుమాళ్‌ను దర్శించి తమ పరుగు పూర్తి చేస్తారు. ఈ ఆలయం చేరదేశపు బాణీలో నిర్మితమై ఉండటంతో ఆలయంలోపలకు చొక్కా ధరించిన పురుషులకు అనుమతించరు. ఇక్కడ పెరుమాళ్ 22 అడుగుల పొడవుగా ఉన్నారు. గర్భాలయానికి మూడు ప్రవేశద్వారాలున్నాయి. తిరుముఖం, తిరుక్కరమ్, తిరుపాదం అంటూ మూడు ప్రాంతాల్లో ఒక్కో ప్రవేశ ద్వారం నుండి భక్తులు దర్శనం చేసుకుంటారు. తిరుముఖ ప్రవేశద్వారం నుండి దర్శించుకుంటే శయనిస్తున్న ప్రశాంతవదనమైన స్వామివారి ముఖారవిందం కనిపిస్తుంది. ఆదిశేషుడు, గరుడాళ్వార్ దర్శనమిస్తారు. స్వామివారు తామర, బ్రహ్మదేవుడు లేని నాభి ప్రాంతాన్ని కలిగి ఉన్నారు. స్వామివారి శిరస్సు వద్ద 'హతలోయ మహర్షి' మోకాళ్లపై కూర్చుని ఉంటారు. ఇక తిరుచక్ర ప్రవేశద్వారం నుండి చూస్తే చిన్ముద్రలో దక్షిణహస్తం, శంఖు, చక్రధారుడైన స్వామివారిని దర్శించవచ్చు. మూలవిరాట్టును ఆనుకుని నేలపై ఉత్సవమూర్తిగా అమ్మవారు దర్శనమిస్తారు.. తిరుపాద ప్రవేశ ద్వారం తిరుపాదాలను దర్శించుకోవచ్చు. పడమటి వైపు చూస్తూ దర్శించడం అత్యంత విశేషదాయకం. దక్షిణ దిశగా శిరస్సునుంచుకుని, పడమటివైపు తిరుమేనిని చూపుతూ శయన భంగిమలో దర్శనమిస్తున్నారు. పక్కనే తాయార్ మరకతవళ్ళి అనుగ్రహిస్తున్నారు.


ఏకశిలా మండపం


మహామండపం


మూలవిరాట్టు తైలవర్ణచిత్రం

ఏకశిలా మండపం..

గర్భాలయం ముందు ఏక శిలా మండపం ప్రాచీన శిల్పకళా నైపుణ్యతను చాటేలా కనువిందు చేస్తుంది. 18 అడుగుల విస్తీర్ణం, 3 అడుగుల ఎత్తు కలిగి ఏకరాతి మండపమిది. దీని కుడ్యాలు 3 అడుగుల మందాన్ని కలిగి ఉంది. ఊర్ధ్వతాండవం, వేణుగోపాలుడు, రతీమన్మథులు, లక్ష్మణుడు, ఇంద్రజిత్తుడి శిల్పాలున్నాయి. ప్రాకార స్తంభాలపై వరుసగా ఉన్న దీపలక్ష్మీదేవి రూపాలు వేర్వేరు ఆకారాల్లో ఉంటాయి. ఇక మురళీకృష్ణుడి వేణుగానాన్ని వింటూ గుమికూడిన పశుగణాల శిల్పాలు కూడా వీక్షకులకు కనువిందు చేస్తాయి.

ఆలయ విశేషాలు..

ఓనం, పురటాసి శనివారాలు, ఐప్పసి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో ప్రత్యేక పూజలు, తిరుమంజనం అందుకుని, వివిధ వాహనాల్లో స్వామివారు ఊరేగుతారు. ఈ స్వామివారిని మనసారా వేడుకుంటే ముక్తి లభిస్తుందని వైష్ణవపండితోత్తములు చెబుతున్నారు. పాలపాయాసం, అవల్, అప్పం ప్రసాదాలుగా అందజేస్తారు. తిరువనంతపురం పద్మనాభస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న విధంగానే ఈ ఆలయంలోనూ పూజలు జరుగుతాయి..

ఎలావెళ్ళాలి?...

ఈ ఆలయం నాగర్‌కోవిల్‌కు 30 కి.మీ. దూరంలో ఉంది. నాగర్‌కోవిల్‌కు చెన్నై నుండి రైళ్లు, బస్సులున్నాయి. నాగర్‌కోవిల్ నుండి టౌన్ బస్సులు,టాక్సీలలో ఆలయానికి చేరుకోవచ్చు. మార్తాండానికి 6 కి.మీ.ల దూరంలో ఉన్న ఆలయానికి ఆటోలున్నాయి.. కన్నియాకుమారి జిల్లాలోని ముఖ్య నగరాలైన నాగర్‌కోవిల్ తక్కలై, మార్తాండం నుండి తిరువట్టారుకు నేరుగా బస్సులు నడుపుతున్నారు. ఈ ఆలయాన్ని వేకువజాము 5 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

12శతాబ్దాలనాటి ఆలయం...

తిరువనంతపురంలో తిరువిందాకూర్ మహారాజులు పద్మనాభస్వామి ఆలయాన్ని నిర్మించడానికి ముందు తిరువట్టార్ ఆదికేశవస్వామివారిని ఆరాధించేవారని చరిత్రచెబుతోంది. ఈ కేశవ పెరుమాళ్ తిరువనంతపురం పద్మనాభస్వామివారి కంటే ముందు ఈ క్షేత్రంలో ఆవిర్భవించారు. నమ్మాళ్వార్ పదకొండు కీర్తనల ద్వారా మంగళాశాసనమొనర్చిన చేర దివ్యదేశమిది. క్రీ.శ. 9వ శతాబ్దానికి చెందిన నమ్మాళ్వార్ ఈ ఆలయాన్ని వర్ణిస్తూ మంగళాశాసనమొనర్చడాన్ని బట్టి ఈ ఆలయం 1200 యేళ్లనాటిదని చరిత్రకారులు నిర్ధారించారు. పురటాసి, పంగుణి మాసాల్లో ఆరురోజులపాటు ఆలయంలోని మూలవిరాట్టుపై సూర్యభగవానుడి కిరణాలు ప్రసరిస్తాయి.


→ కనువిందు చేస్తున్న తిరుమాలుడు

మూలవిరాట్టు నామధేయం : ఆదికేశవపెరుమాళ్

తాయార్ నామధేయం : మరకతవళ్ళి నాచ్చియార్

తీర్థం : కడల్‌వాయ్ తీర్థం, వట్టారు, రామతీర్థం


ఆలయ వెలుపలి ప్రకారం

రూ.40 కోట్లతో తమిళ జ్ఞాన ప్రాంగణం

- శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణి ప్రాంతంలో రోజా ముత్తయ్యా పరిశోధన గ్రంథాలయం ఆధ్వర్యంలో తమిళ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, నాగరికత భావితరాలకు అందించటంలో భాగంగా రూ.40 కోట్లతో నిర్మించనున్న తమిళ జ్ఞాన ప్రాంగణానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. గురువారం ఉదయం చెన్నై సచివాలయం నుంచి జ్ఞాన ప్రాంగణానికి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. రోజా ముత్తయ్యా పరిశోధన గ్రంథాలయం, సింధు నాగరికత పరిశోధనా కేంద్రం, సర్వజనీన విజ్ఞాన పరిశోధన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాంగణాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్.మురుగానందం, రాష్ట్ర ప్రణాళికా సంఘం డిప్యూటీ ఛైర్మన్ జే జయరంజన్, రోజా ముత్తయ్యా పరిశోధన గ్రంథాలయం ట్రస్టీలు ఆర్.బాలకృష్ణన్, మరియం రామ్, ఆర్ రామచంద్రన్, ఇంద్రన్, సుందర్ గణేషన్, కట్టడ నిర్మాణ రూపశిల్పి పి. రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నై సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమిళ జ్ఞాన ప్రాంగణానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి


తిరుచెందూరు ఆలయంలో మహాకుంభాభిషేకం ఏర్పాట్లలో భాగంగా యాగశాల పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



ప్రభుత్వ సిబ్బంది ఎంపిక సంస్థ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సచివాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ముగిసిన గ్రాండ్‌మాస్టర్స్ సౌత్‌జోన్ సిరీస్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీకాంత్, హంపి తదితరులు

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీజీ గ్రాండ్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్ సౌత్‌జోన్ సిరీస్ ముగిసింది. ఈ సిరీస్‌లో తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ దీవుల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు చెన్నైలో జరిగిన ఈ సిరీస్ బుధవారం ముగిసింది. ఇండియన్ చెస్ మాస్టర్స్ పురుషుల విభాగంలో సేతురామన్, ఆర్నవ్ మహేశ్వరి, ప్రదీప్ కుమార్ వరుసగా స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు సాధించారు. మహిళల విభాగంలో కీర్తి శ్రీ రెడ్డి, కనిష్క, ప్రదీక్ష వరుసగా స్వర్ణం, రజతం, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్, ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ కోనేరు హంపి, రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్ తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రపంచ రికార్డు సాధించిన ఎస్ఆర్ఎం హోటల్ యాజమాన్యం


నూనెలేకుండా వడలు తయారు చేసిన విద్యార్థులతో చెఫ్‌లు

ప్యారీస్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాటాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం హోటల్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో గురువారం నూనె వాడకుండా 1,993 వడలను తయారుచేసి ప్రపంచ రికార్డు సాధించింది. 1993వ సంవత్సరంలో ఎస్ఆర్ఎం గ్రూప్ విద్యాసంస్థల ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్ పారివేందర్ హోటల్ మేనేజిమెంట్ కళాశాలను పరిచయం చేశారు. డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఆంథోని అశోక్‌కుమార్ ఇప్పటివరకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఆ కళాశాలలో చదువుకుంటున్న 93 మంది విద్యార్థులు 60 కిలోల మినప్పప్పు, ప్రోటీన్లు కలిగిన చిరుధాన్యాలతో ఒవెన్‌లో నూనె లేకుండా 1,993 సాంబారు వడలు తయారు చేసి, జీరో హంగర్ లోగో ఆకారం రూపొందించి తమ ప్రతిభ చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ట్రయంప్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ డైరెక్టర్ కృష్ణకుమార్, ఎస్ఆర్ఎం హోటల్ మేనేజిమెంట్‌కు ప్రపంచ రికార్డు ధృవీకరణ పత్రాన్ని అందించి అభినందించారు.

రూ.130 కోట్లతో చెంగల్పట్టు బస్ టెర్మినల్

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి శేఖర్‌బాబు



చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.130 కోట్లతో నిర్మిస్తున్న చెంగల్పట్టు బస్ టెర్మినల్ ను ఆ సంస్థ ఇన్‌ఛార్జిగా ఉన్న మంత్రి పీకే శేఖర్‌బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ బస్‌టెర్మినల్ పనులన్నీ డిసెంబర్‌లోగా పూర్తవుతాయని తెలిపారు.. ఈ బస్ టెర్మినల్‌లో రోజూ 600లకు పైగా బస్సులు వచ్చి వెళ్లే విధంగా సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఒకే సమయంలో 57 బస్సులు ప్లాట్‌ఫాంలో నిలిచే అవకాశంకూడా ఉందన్నారు. ఈ బస్ టెర్మినల్ ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్యలు బాగా తగ్గుతాయన్నారు. కూత్తంబాక్కం బస్‌టెర్మినల్, మహాబలిపురం బస్ టెర్మినల్ పనులు కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు.


రాయపురం జోన్ బేసిన్ బ్రిడ్జి వద్ద వాననీటి కాల్వ మరమ్మతు పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ ఆర్.ప్రియ



డిశ్చార్జ్ అయిన భాస్కర్ నాయుడితో వైద్య సిబ్బంది

కోలుకున్న స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు

తిరుమల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మరోమారు పాము కాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైన టీటీడీ స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు కోలుకుని ఆస్పత్రిని నుంచి డిశ్చార్జ్ అయ్యారు. నెల 27న తిరుమల గోగర్భం డ్యాం సమీపంలోని గార్డెన్‌లో నాగుపాము కాటుకు గురై కుప్పకూలిపోయాడు. వెంటిలేటర్‌పై ఈయనను తిరుపతిలోని అమర ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. ఆరు రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకుని గురువారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు.

'ఆ దినం.. నాగుపాము ఉందని ఫోన్ చేశారు. పిల్ల పామే అది. పట్టుకున్నా. ఎట్నో ఎడం చెయ్యిమీద కాటేసింది. కొంచేపటికే కండ్లు కనపడలేదు. ఆడ్నే పడిపోయినా. మళ్ల కండ్లు తెరిచి చూస్తే ఆస్పత్రిలో ఉండా. ఆ పెద్దాయన(శ్రీవారు) దయవల్లనే ఎంతటి పాము కాటేసినా బతికి బయటపడతా ఉండా. ఆ సామే మళ్లీ నన్ను బతికించినాడు. నలభై ఏండ్లుగా సామి సేవలోనే ఉండా. ఆయన కోరుకున్నంత కాలం ఉంటా. మా అధికారులు కూడా నా కోసం తపన పడ్డారు. డాక్టర్లు బాగా చూసుకున్నారు. అందరికీ దణ్ణాలు.'

- భాస్కర్‌నాయుడు

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఎర్రావారిపాలెం, జూలై 3(ఆంధ్రజ్యోతి): తలకోనలో ఈతకు వెళ్లి గల్లంతైన మదనపల్లె యువకుడి మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. రెండు రోజుల క్రితం ఆరుగురు యువకులు తలకోన ఎగువ గుండంలో ఈతకు దూకగా షహెల్(21) గల్లంతైన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి పొద్దుపోయేవరకూ గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం తిరుపతి, అన్నమయ్య జిల్లా పీలేరు నుంచి ప్రత్యేక రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలించాయి. నీటి అడుగు భాగంలో సొరంగాల వద్ద బండరాళ్ల మధ్య చిక్కుకున్న షహెల్ మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్టు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,510

తలనీలాలు సమర్పించినవారు: 28,050



కల్తీ మద్యానికి తావులేదు

● అధికారుల సమావేశంలో ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి



జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన ఈఎస్

తిరుపతి(నేరవిభాగం), జూలై 3 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో కల్తీ మద్యం ఎక్కడా కనిపించకూడదు.. కనిపిస్తే సంబంధిత అధికారులే బాధ్యులు.. ఇప్పటికే ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది.. కల్తీ మద్యం విక్రయించినా, తయారు చేస్తున్నట్లు తెలిసినా చర్యలు తీసుకుంటాం' అని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ హాలులో గురువారం అదనపు ఈఎస్‌లు వాసుదేవ చౌదరి, వూహశ్రీ, సీఐలు, ఎన్‌ఫోర్సుమెంటు ఎస్‌ఐ స్వామినాథన్, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో సమావేశమయ్యారు. మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం జూలై ఒకటి నుంచి ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ ఎఫ్‌ఐఆర్‌లను ఎప్పటికప్పుడు సిస్టమ్‌లో నమోదు చేయాలన్నారు. పాత నిందితుల కదిలకలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం దుకాణాల సమయపాలన గురించి ఆరా తీయాలన్నారు. బెల్టు షాపులు కనిపిస్తే కేసులు నమోదు చేయాలన్నారు.

కార్పొరేషన్ 'ప్లాస్టిక్ రైడ్స్'

● 300 కిలోలు సీజ్.. రూ.50వేల జరిమానా



ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుపతి, జూలై3(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై తిరుపతి నగరపాలక సంస్థ ఉక్కు పాదం మోపుతోంది. 'ప్లాస్టిక్ సిటీ' పేరిట గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కమిషనర్ మౌర్య స్పందించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి నేతృత్వంలో 80 మంది సెక్రటరీలు, 50 మంది మేస్త్రీలు తోపుడు బండ్ల నుంచి షాపింగ్ మాల్స్ వరకు తనిఖీలు చేశారు. 300 కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి రూ.50వేల జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'వారం కిందట వెయ్యి టన్నుల వరకు సీజ్ చేశాం. తొలిసారి పట్టుకుంటే జరిమానా వేస్తాం. రెండోసారి నోటీసులు, మూడోసారి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు దొరికితే ట్రేడ్ లైసెన్స్ రద్దుచేస్తాం. రూరల్‌లోని ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమల్లో ఉత్పత్తి చేయకుండా చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రజల్లోనూ అవగాహన రావాలి' కమిషనరు మౌర్య పేర్కొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీవాణి దాతలతో ఇలాగేనా?

● ఆలయం ముందు భక్తుల ఆవేదన

తిరుమల, జూలై3(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు దాతల పట్ల టీటీడీ ఉద్యోగులు దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ తిరుమల శ్రీవారి ఆలయం ముందు గురువారం ఓ భక్తబృందం ఆవేదన వ్యక్తం చేసింది. రూ.50 గది ఇచ్చి 'ఇష్టం ఉంటే తీసుకోండి లేకుంటే పొండి' అంటూ మాట్లాడారంటూ పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటకు చెందిన భక్తులు ఆరోపించారు. నిమ్మల మురళీకృష్ణ, శ్రీనివాసరావు, గురవయ్య, శంకర శ్రీనివాస్, షబ్బీల్ అనే ఐదుగురు భక్తులు శ్రీవాణి ట్రస్టుకు విరాళమిచ్చి, గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'శ్రీవాణి టికెట్ల కోసం జేఈవో కార్యాలయానికి బుధవారం వేకువజామున 3, 4 గంటల మధ్య వెళ్లాం. ఉదయం 7.30కు టికెట్లు ఇస్తామన్నారు. కనీసం అక్కడ కూర్చోవడానికి కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీరు లేవు. నాలుగైదు వందల మందితో క్యూలైన్ ఏర్పడింది. మరోవైపు క్యూలో ఉండటానికి వీల్లేదని బయటకు నెట్టేశారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఐదుగురికి రూ.52,500 చెల్లించి టికెట్లు పొందితే, కనీసం రూ.వెయ్యి లేదా రూ.500 గదులైనా ఇవ్వకుండా కేవలం రూ.50 గదులు రెండు ఇచ్చారన్నారు. ఆ గదులు బొద్దింకలు, బల్లులు, పురుగులతో ఉన్నాయన్నారు. ఇష్టం ఉంటే తీసుకోండి లేకుంటే పొండి అంటూ గది కేటాయించే ఉద్యోగి మాట్లాడటం బాధ కలిగించిందన్నారు. మీడియాతో మాట్లాడుతున్న సమయంలో తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్ వారి వద్దకు వచ్చి నచ్చజెప్పి పంపారు.

ఆరోపణలు అవాస్తవం: టీటీడీ

కాగా శ్రీవాణి భక్తుల ఆరోపణలు అవాస్తవమని టీటీడీ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో ఖండించింది. రోజూ ఉదయం 8.30 గంటలకే శ్రీవాణి టికెట్లు జారీ చేస్తామని, గంట ముందు మాత్రమే భక్తులను అనుమతిస్తామని, వేకువజామునే వచ్చి నిరీక్షించి ఇలా ఆరోపణలు చేయడం తగదని పేర్కొంది. కౌంటర్ తెరిచాక మాత్రమే టీ, కాఫీ, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నామని వివరించింది. తిరుమలలో అందుబాటులో ఉన్న గదులు మాత్రమే కేటాయిస్తామని, గదులు శుభ్రంగా లేవన్నది నిజం కాదని పేర్కొంది. టీటీడీపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.



భక్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌శేఖర్

తిరుపతి కలెక్టర్‌గా వెంకటేశ్వర్ బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది

పరుగులు పెడుతున్న పనులు

సుదీర్ఘ సమస్యలకు పరిష్కారం

1

యువకుడు.. పేద కుటుంబం నుంచి వచ్చినవాడు.. కష్టం విలువ ఎరిగిన అధికారి.. డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్. జిల్లా కలెక్టర్‌గా తొలి అవకాశం. తొలి ఏడాదిలో ఆయన ప్రయాణం ఎలా సాగింది? జిల్లా పాలనా సారథిగా ఆయన చేసిన కృషి ఏమిటి? తొలి ఏడాది ఆయన చేయగలిగినవీ, అసంతృప్తి మిగిల్చినవీ.. మలి ఏడాది చేయాలని పెట్టుకున్న లక్ష్యాల వివరాల సమాహారం...



● చకచకా రహదారి నిర్మాణాలు
● రైల్వే ప్రాజెక్టులకు కదలిక
● నిషేధిత భూములకు మోక్షం

ఏడాది కాలంలో

పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు: 25,550
పరిష్కారం అయినవి: 20,500
సిటిజన్ సర్వీసులకు సంబంధించిన అర్జీలు: 3.50 లక్షలు
పరిష్కారం అయినవి: రెవిన్యూకు సంబంధించి 12 వేల మ్యుటేషన్లు

కథనం, ఇంటర్వ్యూ
తిరుపతి, ఆంధ్రజ్యోతి బ్యూరో

రయ్ రయ్.. మన్న రహదారులు

జిల్లాలో ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తి కాకుండా కొన్ని సమస్యలు ఉండిపోయాయి. వాటిమీద జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక దృష్టిపెట్టారు. అన్ని శాఖలనూ సమన్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహించి వాటి పూర్తికి కృషి చేశారు.



నాయుడుపేట వద్ద ఎన్‌హెచ్ సర్కిల్

● పూతలపట్టు-నాయుడుపేట సిక్స్‌లేన్ రోడ్డులో రేణిగుంట నుంచీ నాయుడుపేట వరకూ 72 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం గతంలో పలుచోట్ల ఆగిపోయింది. ఆయా కేసుల మీద దృష్టి పెట్టి ఏడాదిలోనే నిర్మాణం పూర్తయ్యేలా కలెక్టర్ చొరవ తీసుకున్నారు. ప్రధాని వర్చువల్‌గా ఈ రహదారిని ప్రారంభించారు.

● మదనపల్లె-తిరుపతి ఫోర్‌లేన్ రోడ్డులో భాగంగా భాకరాపేట నుంచీ తిరుపతి నడుమ 18 కిలోమీటర్ల ఘాట్ రోడ్డు విస్తరణకు అటవీ అనుమతులు సాధించారు. దీంతో రూ. 670 కోట్ల అంచనా వ్యయంతో ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు పిలుస్తున్నారు. రెండేళ్ళలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి కానుంది.

● తిరుపతి-చెన్నై రోడ్డులో సి.మల్లవరం నుంచీ పుత్తూరు వరకూ రూ. 778 కోట్ల అంచనాతో 37 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణకు లైన్ క్లియర్ అయ్యింది. అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఏడాదిన్నరలో పనులు పూర్తి కానున్నాయి.

● కేంద్రం మంజూరు చేసిన ప్రతిష్టాత్మక సాగరమాల ప్రాజెక్టు కింద మూడు రోడ్ల నిర్మాణం భూసేకరణ సమస్యలతో ఆగిపోయింది. మూడు ప్యాకేజీలూ గ్రీన్ ఫీల్డు రోడ్లే. పంట భూములు సేకరించి కొత్తగా రోడ్లు వేయాల్సినవి. భూసేకరణను వేగంగా పూర్తి చేయించడంతో రూ. 3800 కోట్ల సాగరమాల రోడ్ల నిర్మాణం మొదలైంది. ఏడాదన్నరలో నిర్మాణం పూర్తి కానుంది.

రెండో ఏడాది లక్ష్యాలు ఇవీ...

● జిల్లాలో సాగరమాల రోడ్డు ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు వేగంగా జరిగేలా ప్రయత్నిస్తా.
● పర్యాటక రంగంలో బెస్ట్ కలెక్టర్‌గా సీఎం నుంచీ అవార్డు అందుకున్నా.ఆ రంగంలో రిసార్టు హోటళ్ళు తలకోన, ఉబ్బలమడుగు వంటి ఐదు జలపాతాలను మరింతగా అభివృద్ధి చేయదలచుకున్నా. తూపిలిపాలెం బీచ్‌ను తీర్చి దిద్దేందుకు ప్రయత్నిస్తా.
● పారిశ్రామికంగా మెగా ప్రాజెక్టులకు త్వరగా భూములు కేటాయించడంపై దృష్టి పెడతా. - పెండింగులో వున్న సంక్షేమ హాస్టళ్ళ పనులు పూర్తి చేయిస్తా.

కలెక్టర్‌తో కాసేపు

కలెక్టర్‌గా ఈ ఏడాది కాలంలో మిమ్మల్ని కలతపెట్టిన అంశం ఏమిటి?

జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట నన్ను వెంటాడుతూనేవుంది. తీవ్రంగా కలత చెందా. నిజానికి టోకెన్ల జారీకి అవసరమైన ఏర్పాట్లు, చర్యలూ పకడ్బందీగానే తీసుకున్నాం. అయినా ఘోరం జరిగింది. సీఎం గారికి ఫోన్ చేసి చెప్పగానే ఎందుకిలా జరిగింది అని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేకపోయాను.

సంతృప్తినిచ్చింది ఏమిటి?

చాలా మంది పేద, మధ్యతరగతి బాధితులు వారి భూములు 22-ఏ జాబితా నుంచీ తొలగిపోయాక కృతజ్ఞతలు చెప్పడానికి కలెక్టరేట్‌కు వచ్చారు. వారి కళ్ళలో కనిపించిన సంతోషం చాలా సంతృప్తినిచ్చింది. అలాగే ఉపాధి హామీ కింద రూ. 300 కోట్లు ఖర్చు చేసి 217 కిలోమీటర్ల సిమెంటు, తారు రోడ్లు నిర్మించగలగడం గొప్ప తృప్తి కలిగించింది. జిల్లాలో 197 సంక్షేమ హాస్టళ్ళ భవనాలు దుస్థితిలో వుండేవి. రూ. 29 కోట్లు ఖర్చు చేసి మరమ్మతులు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాం.

అసంతృప్తి కలిగించిన అంశం?

శెట్టిపల్లి భూవివాదాన్ని 8 నెలల్లో పూర్తి చేయాలని అనుకున్నా. సంక్లిష్టత కారణంగా ఏడాది పట్టింది. దాదాపు ప్రతిపాదనలు పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో ప్రభుత్వం నుంచీ అనుమతి వచ్చే అవకాశముంది.

రైలు మార్గాలకు పచ్చజెండా



తూకివాకం వద్ద పూర్తయిన ఆర్వోబీ

జిల్లాలో సుదీర్ఘకాలంగా నిలచిపోయిన రైల్వే పనులు ఈ ఏడాదిలో చకచకా కదిలాయి. రైల్వే, రాష్ట్ర అధికారులతో తరచూ కలెక్టర్ నిర్వహించిన సమావేశాలు సత్ఫలితాలను ఇచ్చాయి.

● నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే కొత్త లైను నిర్మాణానికి ఈ ఏడాదిలో మోక్షం వచ్చింది. గూడూరు శ్రీకాళహస్తి మధ్య 24 కిలోమీటర్ల లో 460 ఎకరాల భూమి సేకరణ ప్రక్రియ ముందుకు కదిలింది. ప్రస్తుతం 90 శాతం భూసేకరణ పూర్తి చేయించారు. దీంతో కొత్త రైల్వే లైను నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నారు.

● రేణిగుంట రైల్వే బైపాస్ లైను నిర్మాణం మంజూరైనప్పటికీ ఏడు ఎకరాల భూసేకరణ జరగక పనులు పెండింగులో పడ్డాయి. ఆ భూముల్లో ఉన్న షికారీలను ఒప్పించి ఇళ్ళను తొలగించారు. దీంతో బైపాస్ లైన్ పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తయితే ఆ మార్గంలో రైళ్ళ ప్రయాణాలకు 45 నిమిషాలు ఆదా అవుతుంది.

● ఏడేళ్ళుగా పెండింగులో ఉండిపోయిన తూకివాకం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయించడం ఈ ఏడాదిలో పెద్ద విజయం. ఈ మార్గంలో ఆరు గంటలపాటూ రైళ్ల రాకపోకలు ఆపడం అనే నిర్ణయం తీసుకోలేక ఇది అసంపూర్తిగానే ఉండిపోయింది. కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవతో ఆగమేఘాలపై ఆర్వోబీ పూర్తయింది.

ఏడాది ప్రగతికి మైలు రాళ్లు

4520 ఎకరాలకు 22-ఏ నుంచి విముక్తి

జిల్లాలో శ్రీసిటీ, కృష్ణపట్నం పోర్టులకు సంబంధించి 4520 ఎకరాల భూములు 22-ఏ నిషేధిత జాబితాలో వుండిపోవడంతో ఆ భూములను వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది. వాటిని పరిశ్రమలకు కేటాయించడానికి వీల్లేకుండా పోయింది. దీనిపై దృష్టి సారించిన కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించి 4520 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీంతో ఆ భూముల్లో కొత్త పరిశ్రమలు రావడానికి అవకాశం ఏర్పడింది.

మూడున్నర నెలల్లో ఎల్జీకి భూములు

ఈ ఏడాదిలో జిల్లాకు దక్కిన పెద్ద పరిశ్రమ ఎల్జీ. ఇందుకు సీఎం చంద్రబాబు చొరవ తీసుకున్నారు. రూ. 5 వేల కోట్ల పెట్టుబడితో పెడుతున్న ఈ పరిశ్రమ వల్ల జిల్లా వాసులకు పెద్ద ఎత్తున ఉపాధి లభించనుంది. కేవలం మూడున్నర నెలల్లోనే 186 ఎకరాల భూమిని సేకరించి ఎల్జీ సంస్థకు కేటాయించారు. దీంతో ఇటీవలే మంత్రి నారా లోకేశ్ ఎల్జీ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.



తూర్పుకనుపూరు- కృష్ణపట్నం పోర్టు సాగరమాల రోడ్డు నిర్మాణం

క్రిస్ సిటీకి తొలగిన అడ్డంకులు

ఐదేళ్ళలో రూ. 37 వేల కోట్ల పెట్టుబడులు, 4.86 లక్షల ఉద్యోగాలు తీసుకురాగల క్రిస్ సిటీ జిల్లాలో ఏర్పాటు కావడానికి భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది. కోట, చిల్లకూరు మండలాల్లో కేటాయించిన 2500 ఎకరాల్లో 986 ఎకరాలు ప్రభుత్వానివి. మిగిలిన భూముల సేకరణపై కలెక్టర్ దృష్టి పెట్టారు. బాధ్యతలు తీసుకున్న రెండవ రోజే ఈ భూములు పరిశీలించారు. ఐదేళ్ళుగా పెండింగులో వున్న ఈ సమస్యపై అవగాహన తెచ్చుకుని పలుసార్లు రైతులతో సమావేశమై ఒప్పించారు. 603 మంది అర్హులను గుర్తించి వారికి రూ. 78 కోట్లు పరిహారం ఇప్పించారు. ఆ నిధులు కూడా క్రిస్ సిటీ భూసేకరణకు కేటాయించిన నిధులపై వచ్చిన బ్యాంకు వడ్డీయే. ఇపుడు క్రిస్ సిటీ మౌళిక సదుపాయాలకు రూ. 1400 కోట్లు మంజూరు కాగా అందులో రూ. 153 కోట్ల పనులు మొదలయ్యాయి.

రూ.1500 కోట్ల దామినేడు భూములు దక్కాయి

తిరుపతి రూరల్ మండలం దామినేడులో వంద ఎకరాల ప్రభుత్వ భూమి న్యాయపరమైన వివాదాల్లో ఉండేది. వీటి విలువ రూ. రూ. 1500 కోట్లుగా అంచనా.హైకోర్టులో ఉన్న ఐదు రిట్‌ల మీద జిల్లా పాలనా యంత్రాంగం దృష్టి పెట్టింది. వంద ఎకరాలు ప్రభుత్వపరం అయ్యాయి. ఆ వెంటనే 35 ఎకరాలు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం శాప్‌కూ, 15 ఎకరాలు జిల్లా కోర్టు కాంప్లెక్సుకూ, మిగిలినవి రెండు సంస్థలకూ కేటాయించేశారు. దీంతో మళ్లీ ఆ భూములు మళ్ళీ ఆక్రమణలకు గురి కాకుండా అడ్డుకున్నారు.

మామిడి రైతులను ఆదుకోండి!

● పల్ప్ పరిశ్రమల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

కుప్పం/శాంతిపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ధరల పతనంతో ఇబ్బందులెదుర్కొంటున్న మామిడి రైతులను ఆదుకోవాలని పల్ప్, ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ, శివపురం వద్ద గల స్వగృహంలో మామిడి రైతులు, పల్ప్, ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులతో ముఖ్యమంత్రి గురువారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. ఆర్డర్లు లేవని, నిల్వ చేసుకోవడానికి స్థలం లేదన్న కారణాలు చూపి పల్ప్ పరిశ్రమ తమనుంచి తోతాపురి రకం కాయలను కొనుగోలు చేయడంలేదని రైతులు ఫిర్యాదు చేశారు. అయితే యూరోపియన్ దేశాలలో దిగుమతి సుంకాలు ఎక్కువవడంవల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని ఎగుమతిదారులైన ఆ ప్రతినిధులు నిస్సహాయత వ్యక్తం చేశారు. సుంకాలు తగ్గించేలా ఆయా దేశాలను ఒప్పించేలా కేంద్రంతో మాట్లాడాలని విన్నవించారు. అలాగే మ్యాంగో పల్ప్‌పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతంనుంచి 5 శాతానికి తగ్గించేలా కేంద్రంతో మాట్లాడాలన్నారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, జీఎస్టీ తగ్గింపుపై కేంద్రానికి ఇప్పటికే లేఖ రాశానని, మరోమారు మాట్లాడతామని చెప్పారు. ప్రస్తుతం ఎకరాకు 6 నుంచి 12 టన్నుల మేర మామిడి ఉత్పత్తి వచ్చిందని, రైతులకు మంచి ధర రావాలని సీఎం అన్నారు. అలాగే ప్రాసెసింగ్ యూనిట్లు, పల్ప్ పరిశ్రమలు కూడా వీలైనంత మేర మామిడి రైతుల ఉత్పత్తిని కొనుగోలు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంతోపాటు విద్యార్థులకు మామిడి రసం ఇచ్చేలా చూడాలని, ఈ విషయం గురించి ఆలోచన చేయాలని పల్ప్ యూనిట్ల ప్రతినిధులు చెప్పారు. అయితే ఇప్పటికే మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పోషకాహారమైన గుడ్డును ఇస్తున్నామని, వారు చేసిన సూచనను పరిశీలిస్తామని తెలిపారు.నేచురల్ ఫార్మింగ్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన మామిడిని ఉత్పత్తి చేయాలని మామిడి రైతులకు చంద్రబాబు సూచించారు.మన ఉత్పత్తులు అమ్ముడుపోవాలంటే ప్రపంచ ప్రమాణాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రాసెసింగ్ పరిశ్రమలవారు సామర్థ్యానికి తగినట్లుగా రైతులనుంచి మామిడి కొనుగోలు చేయాలని, అప్పుడే వారికి న్యాయం దక్కుతుందన్నారు. ఎలాంటి వెయిటింగ్ లేకుండా మామిడి రైతులకు కిలోకు 8 రూపాయల ధర చెల్లించి కొనుగోలు చేయాలన్నారు.ప్రస్తుత పరిస్థితిని రాజకీయలబ్ధికి ఉపయోగించుకుందామని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాయలో పడొద్దని రైతులకు సీఎం హితవు పలికారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్ ,జేసీ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛమందజేస్తున్న పల్ప్ పరిశ్రమల ప్రతినిధులు